సస్పెండ్ చేసిన కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి జిల్లా చాతకొండ ఆరో బెటాలియన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సహచర కానిస్టేబుళ్లు

10మంది పోలీసుల డిస్మిస్

- బెటాలియన్ పోలీసులపై సర్కారు ఉక్కుపాదం

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ఏక్ పోలీస్ విధానం అమలు కోసం ఆందోళన చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుళ్లపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. కుటుంబసభ్యులతో కలసి ఆందోళన నిర్వహించిన నేపథ్యంలో శనివారం 39 మంది కానిస్టేబుళ్లపై పోలీస్ శాఖ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఆదివారం సెలవురోజు అయినప్పటికీ తమ సహోద్యోగులపై పెట్టిన సస్పెన్షన్ వేటును ఎత్తివేయాలని ఆయా బెటాలియన్ల పరిధిలోని కానిస్టేబుళ్లు మరోసారి ఆందోళన నిర్వహించారు. సోమవారం సచివాలయ ముట్టడికి కూడా పిలుపునిచ్చారు. బెటాలియన్ కానిస్టేబుళ్లను మరింత భయభ్రాంతులకు గురిచేసేలా ఆదివారం రాత్రి 10 మంది కానిస్టేబుళ్లను సర్వీస్ నుంచి తొలగిస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు వెలువరించింది. ఆర్టికల్ 311(2)(b) ప్రకారం చర్యలు తీసుకున్నట్టు పేర్కొంది. టీజీఎస్పీ ప్రతిష్ఠను దెబ్బ తీసేలా వీధుల్లో ఆందోళనలు చేపట్టడం వల్లే డిస్మిస్ చేస్తున్నట్టు ప్రకటించింది.

అన్యాయంపై ప్రశ్నిస్తే సస్పెన్షనా?

'మేము పోలీసులమా? కూలీలమా? మాకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడమే నేరమా? పోలీసులమని ఉద్యోగంలో చేరితే వెట్టి చాకిరీ పనులు చేయడం ఎంత వరకు సమంజసం. ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని కోరితే సస్పెండ్ చేయడం సరి కాదు' అంటూ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆదివారం గొంతెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా 39 మందిని సస్పెండ్ చేశారని, వారందరినీ తిరిగి విధుల్లో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిరసన తెలిపారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా 9,900 మంది బెటాలియన్ పోలీసులం స్వచ్ఛందంగా రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు. సిరిసిల్లలోని 17వ బెటాలియన్ పోలీసులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అంతకుముందు తమ బెటాలియన్‌లో ఆరుగురిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వంద మందికిపైగా పోలీసు సిబ్బంది బెటాలియన్ ఆవరణలోని కమాండెంట్ కార్యాలయాన్ని ముట్టడించారు. వరంగల్ జిల్లాలోని మామునూరు నాలుగవ బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్లు బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని గుడిపేట లోని 13వ పోలీస్ బెటాలియన్ ఎదుట కానిస్టేబుళ్లు నిరసన తెలిపారు. ఐదుగురు గుడిపేట బెటాలియన్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఆందోళనకు దిగారు. కొత్తగూడెంలోని చాతకొండ బెటాలియన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, రాత్రి బెటాలియన్ ఆవరణలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. నల్లగొండ శివారులోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో ఆదివారం కానిస్టేబుల్ కుటుంబసభ్యులు ఇంటిల్లిపాది రోడ్డెక్కి నిరసన తెలిపారు.

డిస్మిస్‌కు గురైన పోలీసుల వివరాలు

పేరు	బెటాలియన్
జీ రవికుమార్(పీసీ)	3వ బెటాలియన్(ఇబ్రహీంపట్నం)
కే భూషణ్‌రావు(పీసీ)	6వ బెటాలియన్(భద్రాద్రి కొత్తగూడెం)
వీ రామకృష్ణ(పీసీ)	12వ బెటాలియన్(అన్నెపర్తి)
ఎస్కే షఫీ	12వ బెటాలియన్(అన్నెపర్తి)
టీ సాయిరాం(ఏఆర్ఎస్ఐ)	17వ బెటాలియన్(సిరిసిల్ల)
కే లక్ష్మీనారాయణ(పీసీ)	17వ బెటాలియన్(సిరిసిల్ల)
ఎస్ కరుణాకర్‌రెడ్డి (పీసీ)	17వ బెటాలియన్(సిరిసిల్ల)
టీ వంశీ(పీసీ)	17వ బెటాలియన్(సిరిసిల్ల)
బండెల అశోక్(పీసీ)	17వ బెటాలియన్(సిరిసిల్ల)
ఆర్ శ్రీనివాస్(పీసీ)	17వ బెటాలియన్(సిరిసిల్ల)

అరేయ్ బాబు.. వచ్చి గడ్డిపీకు!

'ఏయ్.. టీజీఎస్పీ' ఇవేనా మా సంభోదనలు? ● ఏ పోలీస్‌స్టేషన్‌లోనూ పేరు పెట్టి పిలువరు

కానిస్టేబుల్ ర్యాంక్ అయినా తప్పని వెట్టిచాకిరి ● ఉమ్మడి రాష్ట్రంలో చాలా ఇబ్బందులు పడ్డాం

- కేసీఆర్ హయాంలోనే ఏక్ పోలీస్‌పై అధ్యయనం
- ప్రతిపక్షంలో ఏక్ పోలీసుపై ముఖ్యమంత్రి రేవంత్ హామీ
- సీఎం అయ్యాక మాట్లాడరేం?
- 'నమస్తే'తో కానిస్టేబుళ్లు, కుటుంబసభ్యుల ఆవేదన

బెటాలియన్ పోలీసులతో పైపులను సరిచేయిస్తున్న ఉన్నతాధికారులు

ట్రాక్టర్లలోకి గడ్డిని మోస్తున్న బెటాలియన్ పోలీస్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): 'రేయ్ బాబు..', 'ఏయ్.. టీజీఎస్పీ','అరేయ్ బాబు.. వచ్చి గడ్డిపీకు', 'రేయ్ ఇసుక మొయ్యి'... ఈ సంభాషణలు, సంభోదనలు, మర్యాదలేని మాటలు అన్నీ ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో మాకు నిత్యకృత్యమే.. కానిస్టేబుల్ ర్యాంకు అయినా.. ఏ పోలీస్‌స్టేషన్‌లోనూ మమ్మల్ని పేరుపెట్టి పిలువరని బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఏక్‌పోలీస్ విధానం కోసం ఆందోళన బాట పట్టిన బెటాలియన్ కానిస్టేబుళ్లపై సర్కారు చర్యలకు దిగింది. ఒకే రోజు వివిధ బెటాలియన్‌లలోని 39 మందిపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో పేరు చెప్పడానికి ఇష్టపడని బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యులు 'నమస్తే తెలంగాణ'తో తమ ఆవేదన చెప్పుకున్నారు. తెలంగాణ స్పెషల్ పోలీసు (టీజీఎస్పీ)లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నాటి నిబంధనల్లో నెలకు 26 రోజుల పని ఒకటని చెప్పారు. ఈ విధానంతో ఎంతోమంది తెలంగాణ బిడ్డలు అష్టకష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడో ఆదిలాబాద్‌లో డ్యూటీ చేసే వాళ్లను శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వేస్తే.. ప్రయాణానికే రెండురోజులు పోగా..మిగిలిన రెండురోజులు మాత్రమే కుటుంబంతో గడిపేవాళ్లమని చెప్పారు. ఈ నియంతృత్వ విధానాలకు స్వస్తి చెబుతూ.. స్వరాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 15 రోజులకు రెండ్రోజులు సెలవులు తీసుకునే వెసులుబాటు, ఏయే బెటాలియన్లలో ఉండే వారిని ఆయా బెటాలియన్ జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్లకే డ్యూటీలు విధించేలా అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కఠినతరమైన నిబంధనలకు పాతరేసి, అవసరమైతే మరో రెండ్రోజులు వెసులుబాటును బట్టి సెలవుతీసుకునేలా సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. కేసీఆర్ హయాంలో టీజీఎస్పీ పోలీసులు 15 రోజులుపాటు డ్యూటీలు చేసినా రెండుమూడ్రోజులు కుటుంబంతో హాయిగా గడిపేదని గుర్తు చేసుకున్నారు. బెటాలియన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు 'ఏక్ పోలీసు' వ్యవస్థను తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులను వివిధ రాష్ట్రాల్లో అధ్యయనానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పంపారని గుర్తుచేశారు. అదేసమయంలో ఎన్నికలు రావడంతో నాటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే.. వెంటనే 'ఏక్ పోలీసు'ను అమలు చేస్తామని పలుచోట్ల హామీలు ఇచ్చారని చెప్పారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడవక ముందే.. ఏక్ పోలీసు విధానానికి స్వస్తి చెప్పి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌నాటి 26 రోజుల పని, రాష్ట్రంలో ఎక్కడైనా 3 నెలలు పనిచేసే విధానాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. 'తెలంగాణలో ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేస్తామని, మాతో ఓట్లు వేయించుకున్న రేవంత్‌రెడ్డి గారు.. ఇప్పుడు ఆ విధానంపై ఎందుకు మాట్లాడటం లేదు' అని బెటాలియన్ కానిస్టేబుళ్లు, కుటుంబసభ్యులు ప్రశ్నిస్తున్నారు. 15రోజుల పనివిధానానికి పోలీసుశాఖ ఓకే చెప్పినా.. మాకు కావల్సింది మాత్రం ఏక్ పోలీస్ విధానమేనని వారు స్పష్టం చేశారు. తమకు ఏక్‌పోలీసు తీసుకొచ్చి, 3-5 ఏండ్లు ఒకచోట డ్యూటీ చేసుకునే వెసులుబాటు కల్పించాలని ప్రాధేయపడుతున్నారు. 'పాత రూల్స్ తెచ్చింది వాళ్లే.. దానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తుంటే.. మమ్మల్ని సస్పెండ్ చేసిందీ వాళ్లే' అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు.

పోరాటానికి హోంగార్డులు సై!

- తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన
- నవంబర్ 2న ఇందిరాపార్క్ దగ్గర భారీ ధర్నా?

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారం కోసం హోంగార్డులు కూడా ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. నవంబర్ 2న తమ డిమాండ్ల సాధనకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శాంతియుతంగా నిరసనకు సన్నద్ధమవుతున్నారు. తమకు అడిషనల్ డీజీ ర్యాంకు అధికారి ఉన్నా తమ సంక్షేమం గురించి, జీతభత్యాల గురించి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిపక్షంలో హోంగార్డులను ఊరించిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక వినతిపత్రాలు తీసుకునేందుకూ ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు. ఇతర ఉద్యోగ సంఘాలతో పాటు హోంగార్డులను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇవే ప్రధాన డిమాండ్లు

- పెండింగ్ యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలి.
- ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలి. కారుణ్య నియామకాలు చేపట్టాలి. సాధారణ మరణానికి రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలి.
- పదవీవిరమణ తర్వాత ప్రభుత్వం నుంచి ఆర్థిక వెసులుబాటు కల్పించాలి.
- 2017లో తీసుకొచ్చిన ఎస్పీఏను అమలు చేయాలి.
- ఆర్డర్ టు సర్వ్ ద్వారా ఐపీఎస్‌లు ఎక్కడికంటే అక్కడికి హోంగార్డులను తీసుకెళ్తున్నారు. అదే ఆర్డర్ టు సర్వ్ ద్వారా ఎవరైనా హోంగార్డులు సొంత జిల్లాలకు వెళ్తామంటే ఒప్పుకోవడం లేదు. దీనిని వెంటనే మార్చాలి.
- చాలీచాలని జీతానికి తోడు వైద్య ఖర్చులు భారంగా ఉన్నాయి. కావున హోంగార్డులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి.
- హోంగార్డు కార్యాలయాల్లో ఆర్ఐ స్థాయి నుంచి హెడ్‌కానిస్టేబుల్ స్థాయి వరకూ హోంగార్డులను చాలా ఇబ్బందులు పెడుతున్నారు. వారు చెప్పిన అధికారుల ఇండ్లలోకి వెళ్లి పనులు చేయకపోతే.. డ్యూటీలు లేవని బెదిరిస్తున్నారు. ఆ వేధింపులను వెంటనే ఉన్నతాధికారులు ఆపాలి.

హైదరాబాద్‌లో 163 సెక్షన్ విధింపు

మొదటిపేజీ తరువాయి...

నుంచి 28వ తేదీ సాయంత్రం 6గంటల వరకు ఈ సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. దీని ప్రకారం ఐదుగురు అంత కంటే ఎక్కువ మంది గుమిగూడవద్దని, ధర్నాలు, సమావేశాలు, ర్యాలీలు ఏర్పాటు చేయవద్దని స్పష్టంచేశారు. కానీ..బెటాలియన్ కానిస్టేబుళ్లు మాత్రం సర్కారు ఉక్కుపాదంపై వెనక్కి తగ్గేది లేదని.. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందలేమని పోరుబాట పడుతున్నారు. శనివారం భార్యాపిల్లలతో రోడ్డెక్కిన కానిస్టేబుళ్లపై తెలంగాణ పోలీసు శాఖ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెటాలియన్లలో ఒకే రోజు 39 మందిని సస్పెన్షన్ చేస్తూ అర్ధరాత్రి వేళ ఉత్తర్వులు ఇచ్చింది. తమ సహోద్యోగులు సస్పెన్షన్ గురికావడంతో వారికి బెటాలియన్ కానిస్టేబుళ్లంతా బాసటగా నిలిచారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలని బెటాలియన్ల ముట్టడి చేపట్టారు. గంటలకొద్దీ బెటాలియన్ ముఖద్వారం వద్ద నిరసన చేపట్టినా.. కమాండెంట్ పట్టించుకోకపోవడంతో పట్టరాని కోపంతో రోడ్డెక్కారు. అనంతరం రాత్రి వేళ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అయినప్పటికీ సర్కారులో చలనం రాకపోవడంతో ఉద్యమ కార్యాచరణ ప్రకారం సోమవారం సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్ర నలుమూలల నుంచి బెటాలియన్ కానిస్టేబుళ్లు నగరానికి బయలుదేరినట్టు సమాచారం. పోలీసుల ఆంక్షలు, తనిఖీలు నడుమ.. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ నగరబాట పట్టిన బెటాలియన్ కానిస్టేబుళ్ల సచివాలయ ముట్టడి ఎక్కడికి దారితీస్తుందోనని సర్వత్రా ఆందోళన నెలకొన్నది.

39 మందిపై ఆర్టికల్ 311 ప్రయోగం

- అర్ధరాత్రి.. దొడ్డిదారిన కానిస్టేబుళ్ల సస్పెన్షన్లు

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఏక్ పోలీసు వ్యవస్థను అమలు కోసం కుటుంబసభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుళ్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. దొడ్డిదారిన అర్ధరాత్రి ఆర్టికల్ 311 ప్రయోగించింది. 39 మంది బెటాలియన్ కానిస్టేబుళ్లను నిర్దాక్షిణ్యంగా సస్పెండ్ చేసింది. ఆందోళనలకు ప్రేరేపించిన వారిపై చర్యలు తీసుకున్నట్టు తెలిపింది.

ముథోల్‌లో అరుదైన గధేగల్లు శాసనం

నిర్మల్ జిల్లా ముథోల్‌లో అరుదైన గధేగల్లును కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు గుర్తించారు. ఇది 12వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నట్టు కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, సభ్యుడు బలగం రామ్‌మోహన్ తెలిపారు. ఇవి చాలా అరుదుగా కనిపిస్తాయని, తెలంగాణలో ఇదివరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో గుర్తించినట్టు పేర్కొన్నారు.

- ముథోల్

నల్లసూరీళ్లకు వె(ప)న్ను పోటు!

- సింగరేణిలో అటకెక్కిన ఆదాయపు పన్ను రద్దు అంశం
- ఎన్నికల్లో గెలిస్తే ప్రభుత్వమే చెల్లిస్తుందన్న కాంగ్రెస్ నేతలు
- అధికారంలోకి వచ్చి పది నెలలలైనా ఊసేలేదు
- హామీ మరిచిన కాంగ్రెస్ సర్కారు
- 40వేల మంది బొగ్గుగని కార్మికులపై ఆదాయ పన్ను భారం
- కోలిండియాలో పదేండ్లుగా అమలు
- గత బీఆర్ఎస్ పాలనను గుర్తు చేసుకుంటున్న కార్మికులు

> 'మేం అధికారంలోకి వస్తే మీపై ఉన్న ఆదాయపు పన్ను భారం రద్దుకు కృషి చేస్తాం..లేదంటే మేమే భరిస్తాం.' అంటూ సింగరేణి కార్మికులను కాంగ్రెస్ మభ్యపెట్టింది. ఓడ దాటాక బోడ మల్లన్న అన్నట్లు ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. అధికారంలోకి వచ్చి పదినెలలైనా అటు నేతలు, ఇటు కార్మిక నాయకులు పట్టించుకోకపోవడంతో నల్ల సూలీళ్లు మండిపడుతున్నారు. హక్కుల సాధన కోసం ఉద్యమబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): నల్లనేలలో బీఆర్ఎస్ పాలన.. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) మార్క్ చెరగని ముద్ర. గని కార్మికులు మళ్లీ ఆ రోజులను గుర్తు చేసుకుంటున్నారు. చెప్పని హామీలు సాధించి పెట్టిన సంఘాన్ని, కేసీఆర్ పనితీరును నెమరేసుకుంటున్నారు. కాంగ్రెస్ సర్కారు పదినెలల పాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి పదినెలలైనా ఇచ్చిన హామీలపై నోరు మెదపడం లేదని మండిపడుతున్నారు. సింగరేణి కార్మికులు ఆదాయపు పన్ను రద్దు చేయాలని ఏనాటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గత ఎన్నికల్లో తమను గెలిపిస్తే ఆదాయపు పన్ను రద్దుకు కృషి చేస్తామని, అవసరమైతే ప్రభుత్వమే భరిస్తుందని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌ను నమ్మిన కార్మికులు 11 డివిజన్లలో హస్తానికి మద్దతు పలికారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోలిండియాలో అలవెన్స్‌లపై పన్ను రద్దు పదేండ్లుగా జరుగుతున్నా ఇక్కడ కేవలం అధికారులకే పరిమితమైంది. ఈ విషయమై గుర్తింపు కార్మిక సంఘం సైతం మాట్లాడే పరిస్థితి లేదు.

ఆదాయపు పన్ను రద్దు అసలు సమస్య..

నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, నేడు అధికారంలో ఉన్న బీజేపీ ఆదాయపు పన్నును రద్దు చేయలేకపోయాయి. ప్రాణాలకు తెగించి భూమి పొరలోకి వెళ్లి బొగ్గును వెలికితీసి దేశానికి వెలుగులు అందిస్తున్న బొగ్గుగని కార్మికులకు నేవీ, ఆర్మీ సైనికుల వలె ఆదాయపు పన్ను రద్దు చేయాలని

ఏండ్ల తరబడి పోరాటం కొనసాగుతున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి ఏరియాలోని బొగ్గు గనుల్లో రేవంత్‌రెడ్డితోపాటు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలందరూ ప్రచారం నిర్వహించారు. తాము గెలిస్తే ఆదాయపు పన్ను బాధ మీకు ఉండదని కార్మికులకు భరోసా ఇచ్చారు. హామీ ఇచ్చే సమయంలో సింగరేణిలో 39,748 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతుంది. ఒక్క నాయకుడూ ఈ విషయమై నోరు మెదపడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం సింగరేణిలో సుమారు 40వేల మంది కార్మికులపై ఆదాయపు పన్ను భారం పడుతుంది. కష్టించి పనిచేసిన వేతనం ఆదాయపు పన్నుకే పోతుందని వాపోతున్నారు.

అలవెన్స్‌లపై పన్ను రద్దు ఏది?

సింగరేణి కార్మికులకు పది రకాల అలవెన్స్‌లు ఉన్నాయి. జీతభత్యాలతోపాటు అలవెన్స్‌లు కలుపడంతో ఉద్యోగుల స్లాబ్ పరిధి పెరుగుతున్నది. అలవెన్స్‌ల రూపంలో ఏటా రూ. 3లక్షల వరకు వస్తుండగా వార్షిక ఆదాయం కింద పన్ను భారం పడుతుంది. యాజమాన్యమే పన్ను చెల్లిస్తే కార్మికులకు దాదాపు రూ. 35వేల నుంచి రూ.80 వేల భారం తగ్గే అవకాశం ఉంది. సింగరేణి ఎన్నికల సమయంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు పెర్క్ అలవెన్స్‌లపై రీయింబర్స్‌మెంట్ చేయిస్తామని ఇచ్చిన హామీకి అతీగతి లేదు.

పోరాటంతోనే హక్కుల సాధన

కాంగ్రెస్ నేతలు, ఐఎన్‌టీయూసీ నాయకులు తాము గెలిస్తే ఆదాయపు పన్ను రీయింబర్స్ చేస్తామని హామీ ఇచ్చారు. కోలిండియాలో అలవెన్స్‌లపై ఆదాయపు పన్నును అక్కడి యాజమాన్యమే భరిస్తున్నది. ఇక్కడ ఎందుకు అలా జరగడం లేదు. ఇక్కడ కేవలం అధికారులకు మాత్రమే సంస్థ భరిస్తుంది. ఉద్యమాలతోనే కార్మికుల హక్కులు పరిష్కారమవుతాయి. గెలిచిన పార్టీ, గెలిచిన యూనియన్లతో ఒరిగేదేం లేదు.

- రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

వెట్టి నుంచి విముక్తి కల్పించాలి

- పనిభారం పెంపు జీవోను రద్దు చేయాలి
- బెటాలియన్ కానిస్టేబుళ్ల డిమాండ్లను పరిష్కరించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): బెటాలియన్ కానిస్టేబుళ్ల పనిభారాన్ని పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఇటీవల పలువురు కానిస్టేబుళ్లపై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. బెటాలియన్ కానిస్టేబుళ్లతోపాటు వారి కుటుంబసభ్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రికార్డు పర్మిషన్‌కు సంబంధించిన జీవో వల్ల బెటాలియన్ కానిస్టేబుళ్లపై పనిభారం పెరుగుతున్నదని, నిరంతరాయంగా 26 రోజులు పనిచేయాల్సి వస్తుండటంతో దాదాపు నెల రోజులు కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తున్నదని తెలిపారు. దీని ఫలితంగా ఇటీవల పలువురు కానిస్టేబుళ్లు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. బెటాలియన్ కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారులు ఇష్టం వచ్చినట్టు డ్యూటీలు వేయడంతోపాటు వారితో ఇండ్లలో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు. అయినప్పటికీ బెటాలియన్ కానిస్టేబుళ్లకు ప్రభుత్వం అదనపు ప్రయోజనాలను కల్పించడం లేదంటూ తమ్మినేని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రూప్ -1లో వరుసగా మాస్ కాపీయింగ్

- సెంటర్‌కు 20 మంది పోలీసులతో బందోబస్తు
- చిట్టీలు ఎలా తీసుకెళ్తున్నారన్న అనుమానాలు
- ప్రశ్నల లీకుపై అభ్యర్థుల్లో అనుమానాలు.. ముగిసిన పరీక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1మెయిన్స్ పరీక్షల నిర్వహణలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. వరుసగా కాపీయింగ్ కేసులు బయటపడుతుండటంతో ఏం జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్షలకు కల్పిస్తున్న భద్రత డొల్లేనన్న వాదన లొస్తున్నాయి. సీవీఆర్ కాలేజీలో కాపీయింగ్ ఉదంతం చోటుచేసుకోగా, సైనిక్‌పురి భవన్స్ కాలేజీలో సీల్‌లేని ప్రశ్నపత్రాలను అభ్యర్థులకు అందించారు. శనివారం నారాయణమ్మ కాలేజీలో కాపీయింగ్ ఘటన బయటపడింది. ఈ పరీక్షాకేంద్రంలో గంటన్నర తర్వాత అభ్యర్థిని పట్టుకున్నారు. ఇలా వరుసగా కాపీయింగ్ కేసులు బయటపడుతుండటంతో అభ్యర్థులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ప్రశ్నలు లీకైతేనే చిట్టీలు తీసుకెళ్లే అవకాశముంటుందని ఆరోపిస్తున్నారు. పైగా గ్రూప్-1 పరీక్షాకేంద్రాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షాకేంద్రానికి 20 మంది పోలీసుల చొప్పున డ్యూటీలు కేటాయించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయినా చిట్టీలను పరీక్షాకేంద్రాల్లోకి ఎలా తీసుకెళ్లారా, ఇదంతా కావాలనే జరిగి ఉంటుందన్న ఆరోపణలొస్తున్నాయి. మాస్ కాపీయింగ్ అంటూ సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని టీజీపీఎస్సీ ఖండించింది. రెండు రోజుల్లో రోజుకొక్కరే కాపీయింగ్‌కు పాల్పడుతూ దొరికారని స్పష్టంచేసింది. కాగా గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. పేపర్ -7 తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ పేపర్‌కు పరీక్షను నిర్వహించారు. చివరి పరీక్షకు 31,383 మందికి 21,151(67.3శాతం) పరీక్షకు హాజరైనట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. మొత్తంగా పరీక్షలకు 10 వేలమంది (33శాతం) డుమ్మాకొట్టడం గమనార్హం.

శాస్త్రీయపద్ధతిలో కులగణన చేపట్టాలి

- కులవృత్తుల ఆధునికీకరణకు సాయమందించాలి
- బీసీ కుల సంఘాల ప్రధాన డిమాండ్లు..
- నేటి నుంచి బీసీ కమిషన్ జిల్లాల పర్యటన

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా శాస్త్రీయపద్ధతిలో కులగణన నిర్వహించాలని, రిజర్వేషన్ల శాతాన్ని పెంచడంతోపాటు కులవృత్తుల ఆధునీకరణకు సైతం ఊతమివ్వాలని బీసీ కులసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లు, పారిశ్రామిక రంగంలో సబ్సిడీలు, భూముల కేటాయింపు, బీసీ సబ్‌ప్లాన్, బీసీ కులాల ఉత్పత్తులకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేకమైన సెజ్‌లు, ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం వంటి అంశాలతో పాటు కులాల వారీగా సమస్యలను, వాటికి తాము సూచిస్తున్న పరిష్కార మార్గాలను అమలుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ మేరకు నేటి నుంచి జిల్లాల్లో పర్యటించనున్న రాష్ట్ర బీసీ కమిషన్‌కు పెద్దఎత్తున వినతులు సమర్పించాలని కులసంఘాల ప్రతినిధులు పిలుపునిస్తున్నారు.

బీసీ కమిషన్ పర్యటనలు..

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారు విషయంలో ఆసక్తిగల వ్యక్తులు, ప్రజా, కుల సంఘాల ప్రతినిధుల నుంచి అభ్యర్థనలు, సూచనలు, అభ్యంతరాల స్వీకరణ కోసం రాష్ట్ర బీసీ కమిషన్ ఉమ్మడి పది జిల్లాల్లో నేటి నుంచి పర్యటించనున్నది. నేడు ఆదిలాబాద్, 29న నిజామాబాద్, 30న సంగారెడ్డి, నవంబర్ 1న కరీంనగర్, 2న వరంగల్, 4న నల్లగొండ, 5న ఖమ్మం, 7న రంగారెడ్డి, 8న మహబూబ్‌నగర్, 11న హైదరాబాద్ జిల్లాల్లో సంబంధిత జిల్లాల కలెక్టరేట్లలో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టనున్నది. నవంబర్ 11న ప్రత్